నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 11 జనవరి 2025 | HYDERABAD

పండక్కి..సొంతూళ్లకు ▶ సంక్రాంతి నేపథ్యంలో నగరవాసులు సొంతూళ్లకు పయనమవుతున్నారు. శుక్రవారం ఎంజీబీఎస్‌లో కనిపించిన రద్దీ



దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సాకులు చెప్పొద్దు..

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి..
అధికారులకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశం

బడంగ్‌పేట, జనవరి10: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లెలగూడలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్ తదితరులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మీర్‌పేట పెద్ద చెరువు సమీపంలో నిర్మిస్తున్న క్రీడా మైదానం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. క్రికెట్, కబడ్డీ, బ్యాట్మింటన్, టెన్నీస్ తదితర కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. చిన్న పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులను ఏర్పాటు చేయాలన్నారు. మీర్‌పేట ప్రాంతంలో ఎక్కడ కూడా చెప్పుకోదగ్గ పార్కులు, క్రీడా మైదానాలు లేవన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం నూతన హంగులతో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలన్నారు. అందరికీ అనువుగా ఉండే క్రీడా మైదాన్ని తీర్చిదిద్దాలన్నారు. అన్ని వర్గాల వారికి ఉపయోగ పడే విధంగా చేయాలన్నారు. ఏ మాత్రం జాప్యం చేయకుండా పనులు వేగంగా చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ చుట్టూ గ్రీనరీ ఉట్టి పడే విధంగా తయారు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఆటలు ఆడుకోవడానికి లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేషన్ పాలక వర్గం పదవి కాలం ముగియక ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలి..

చెరువుల్లో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలని ఎమ్మెల్యే చెప్పారు. మంత్రాల చెరువు, చందన చెరువు, పెద్ద చెరువుల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. చెరువు చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. తాత్సారం చేయకుండా పనులు చేయాలని చెప్పారు. శ్మశాన వాటికల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. పనులు ఆలస్యం కావడానికి కారణాలు ఏమిటని అధికారులను అడిగారు. సాకులు చెప్పకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తి చేయించి సమాధానం చెప్పాలన్నారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిల్స్, సీఎం రిలీఫ్ పండు చెక్కులను అందజేశారు.

మళ్లీ హైడ్రా కూల్చివేతలు

మణికొండలో నాలుగు విల్లాల నేలమట్టం

మణికొండ, జనవరి 10: నెక్నాంపూర్ పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలో గత కొన్నాళ్లుగా నిర్మాణాలు చేపడుతున్న లేక్ వ్యూ వెంచర్‌లో నాలుగు విల్లాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో శుక్రవారం కూల్చివేశారు. చెరువు బఫర్‌జోన్ల పరిధిలో నిర్మితమవుతున్న ఈ విల్లాలకు అనేకసార్లు మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసినా.. మొండిగా నిర్మాణాలు చేపడుతుండటంతో స్థానిక ప్రజలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ నెక్నాంపూర్‌లో పర్యటించిన మరుసటిరోజే కూల్చివేతలను చేపట్టారు. గతంలో నూ రెవెనూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు లేక్ వ్యూ లే అవుట్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. అయినా సదరు నిర్మాణదారుల్లో ఎలాంటి మార్పులు లేకపోవడంపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారుల పర్యటన తర్వాత సదరు బిల్డర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

అనుమతులిచ్చి.. ఆపై తిరస్కరించి

నెక్నాంపూర్ గ్రామ పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలోని కొనసాగుతున్న లేక్ వ్యూ వెంచర్‌లో నిర్మితమవుతున్న విల్లాలకు గతంలో మణికొండ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులిచ్చినట్లు తెలిసింది. అయితే ఆ నాలుగు విల్లాలు బఫర్‌జోన్ పరిధిలోకి వస్తాయంటూ స్థానిక గండిపేట రెవెన్యూ అధికారులు సూచించడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులను గుట్టుచప్పుడు కాకుండా రీవోక్ చేసినట్లు సమాచారం. మున్సిపల్ అధికారులు అనుమతులివ్వడంతోనే తాము విల్లాలు నిర్మించామని ఇప్పుడు..హైడ్రా అధికారులు వచ్చి ఎలాంటి నోటీసులు లేకుండానే కూల్చివేశారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు.

2 గంటల ముందే ఎయిర్‌పోర్ట్‌కు రండి

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో ఇబ్బందులు తలెత్తకుండా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ శుక్రవారం ట్రావెల్ అడ్వైసరీ విడుదల చేసింది. విమాన సేవలు వినియోగించుకునే డొమెస్టిక్ ప్రయాణికులు 2 గంటల ముందుగానే విమానాశ్రయానికి చేరుకోవాలని సూచించింది. విదేశీ ప్రయాణికులు 3 గంటల ముందే చేరుకోవాలని కోరింది. డీజీ యాత్ర సేవలు ఉపయోగించుకోవాలని పేర్కొంది. ఇబ్బందులు లేని ప్రయాణం కోసం తమ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

అర్హులకు అందేనా?

ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై దరఖాస్తుదారుల ఆందోళన

ఎంపికలో ఇందిరమ్మ కమిటీలదే ఫైనల్ అంటున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్, జనవరి10(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లపై ఎంపికపై జరగుతున్న ప్రచారాలతో నిరుత్సాహానికి గురువుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇందిరమ్మ కమిటీదే ఫైనల్ అంటూ కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. అర్హులను గుర్తించడంలో ఇందిరమ్మ కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆందోళనను దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో ప్రజాపాలన పేరిట దరఖాస్తులను స్వీకరించింది. అయితే దరఖాస్తుల ఆధారంగా సర్వేను నిర్వహిస్తున్నారు. మొదటి దశలో జాగా ఉన్న వారినే అర్హులుగా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జాగా లేని ఇండ్లు లేని నిరుపేదలు ఆశలపై మొదటి విడతలో నీళ్లు చల్లినట్లయింది. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అర్హులను గుర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ నాయకులు జోక్యం ఉండకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో 1,43 223 దరఖాస్తులు..

మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 13 మున్సిపాలిటీలు 33 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం 1,43 223 దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోని వారికి మరోసారి అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వ ప్రకటనతో మరింత మంది దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే జిల్లాలో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే 90 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. సంకాంత్రి పండగ సందర్భంగా అనేక సెలవు దినాలు వస్తున్నందున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే మరింత అలస్యమయ్యే అవకాశమున్నది. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఏడాది కిందట దరఖాస్తులు చేసుకుంటే ఇప్పుడు సర్వేను ప్రారంభించారని, అర్హుల ఎంపిక ఎప్పుడు చేస్తారని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. అర్హుల ఎంపికను త్వరతగతిన పూర్తి చేసి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతున్నారు. అర్హుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలకు పెత్తనం ఇవ్వకుండా చూడాలని ప్రభుత్వాన్ని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఏటీఎం డిపాజిట్ మెషీన్‌ను ధ్వంసం చేసిన గృహిణి

వెంగల్‌రావునగర్, జనవరి 10 : బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేస్తున్నప్పుడు కొంత డబ్బులు కాజేశారని ఆరోపిస్తూ బ్యాంకు ఉద్యోగులపై కక్షగట్టిన ఓ మహిళ ఏటీఎంను ధ్వంసం చేసింది. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రహ్మత్‌నగర్‌కు చెందిన గృహిణి (35) సూర్యపేటలోని ప్రాపర్టీని అమ్మడంతో రూ.7 లక్షలు వచ్చాయి. ఆ డబ్బును తన ఖాతాలో జమ చేసేందుకు యూనియన్ బ్యాంకుకు వెళ్లి అక్కడ క్యాషియర్‌కు డబ్బులు అందజేసింది. డబ్బులు లెక్కించిన క్యాషియర్ రూ. 21వేలు తక్కువగా ఉన్నాయని చెప్పాడు. తాను 7 లక్షలు ఇచ్చానంటూ రూ. 21వేలు ఎలా తగ్గాయంటూ జరిగిన వాదనలు గొడవకు దారి తీసింది. ఈ నేపథ్యంలో డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో ఎలాంటి అవకతవకలు కనిపించలేదు. ఇదిలా ఉండగా, సదరు మహిళ శుక్రవారం ఉదయం యూనియన్ బ్యాంకు ఏటీఎం డిపాజిట్ మెషీన్ వద్దకు వెళ్లి బండరాయి వేసి దానిని ధ్వంసం చేసింది. బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ పూర్తి

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): జల మండలికి కొత్తగా కేటాయించిన 141 మంది జూనియర్ అసిస్టెంట్స్ (పీఅండ్ఏ, ఎఫ్‌అండ్ఏ)కు రెండు రోజుల శిక్షణ పూర్తయింది. గచ్చిబౌలిలోని ఎస్కీ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు 141 మందిని మూడు బ్యాచులుగా చేసి శిక్షణ తరగతులు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సెలవుల తర్వాత మూడో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు. రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి కావడంతో ఈడీ మయాంక్ మిట్టల్ వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

ఐదు రాష్ట్రాలు గాలించి..

సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్

23 మంది సైబర్‌నేరగాళ్ల అరెస్టు

దేశ వ్యాప్తంగా 359 కేసులతో సంబంధం ● పట్టుబడిన వారిలో యూపీ ఎమ్మెల్యే అభ్యర్థి..

తెలంగాణ యువతకు సైతం సైబర్ నేరగాళ్ల గాలం ● వలలో చిక్కుకొని అరెస్టయిన పలువురు యువకులు

సిటీబ్యూరో: ఐదు రాష్ట్రాల్లో గాలించి.. 30 కేసుల్లో 23 మంది సైబర్‌నేరగాళ్లను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సైబర్‌క్రైమ్స్ డీసీపీ దార కవిత వెల్లడించారు. ఈ నిందితులకు దేశ వ్యాప్తంగా 359 కేసులతో సంబంధముందని వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఉత్తరప్రదేశ్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఓ మహిళ కూడా ఉందని, ఆమె తన ఎన్జీఓ సంస్థకు చెందిన బ్యాంకు ఖాతాను సైబర్‌నేరగాళ్లకు ఇచ్చి వారితో చేతులు కలిపిందని విచారణలో వెల్లడయ్యిందని వివరించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కవిత ఆయా సైబర్‌నేరాల్లో ప్రధాన కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఎన్జీఓ ఖాతాతో..

యూపీకి చెందిన కమలేశ్‌కుమారి వ్యాపారం నిర్వహిస్తూ, స్వచ్ఛంద సంస్థను కూడా నిర్వహిస్తున్నది. ఆమె అక్కడ ఎమ్మెల్యేగా కూడా పోటీ చేసింది. ఎన్నికల్లో పెట్టిన ఖర్చు పెట్టడంతో తాను సొంతంగా ఆర్థిక కష్టాల్లోకి వెళ్లింది. ఆర్థిక కష్టాల నుంచి బయటపడేందుకు సైబర్‌నేరగాళ్లతో పరిచయం ఉన్నవాళ్లు ఆమె ఎన్జీఓ బ్యాంకు ఖాతాను తమకు అప్పగించాలని కోరారు. దీంతో ఆమె తన బ్యాంకు ఖాతాను సైబర్‌నేరగాళ్లకు అప్పగించింది. ఆ ఎన్జీఓ ఖాతాలో బాధితులు డిపాజిట్ చేసే సొమ్ములో తగిన కమిషన్ ఆమెకు అందుతున్నది. ఇలా హైదరాబాద్‌కు చెందిన బాధితుడు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో రూ. 1.90 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ సతీశ్‌రెడ్డి బృందం బ్యాంకు ఖాతాలను ఆరా తీయడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఒక స్వచ్ఛంద సంస్థ అకౌంట్‌లోకి బాధితుడి సొమ్ము డిపాజిట్ అయి, ఆ ఖాతా నుంచి ఇతర ఖాతాలకు బదిలీ కావడం, కొంత సొమ్ము విత్ డ్రా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రత్యేక బృందం యూపీ వెళ్లి కమలేశ్‌కు మారితో పాటు మరికొంత మందిని అరెస్టు చేశారు. ఆమెను అరెస్టు చేయవద్దంటూ యూపీలో 10 మంది లాయర్ల బృందం కోర్టులో వాదనలు వినిపించింది. అయితే పోలీసులు ఆమె బ్యాంకు ఖాతాలోకి బాధితులు డిపాజిట్ చేసిన సొమ్ము, అక్కడి నుంచి ఇతర ఖాతాలకు వెళ్లిన వైనాన్ని కోర్టు దృష్టికి తీసికెళ్లడంతో అక్కడి కోర్టు ట్రాన్సిట్ వారెంట్ జారీ చేయడంతో ఆమెను హైదరాబాద్‌కు తరలించారు.

కోదాడ పరిసరాల్లోని యువతకు గాలం..

ట్రేడింగ్‌లో అధిక లాభాలు సంపాదించవచ్చంటూ నగరానికి చెందిన బాధితుడి వద్ద నుంచి రూ.2.95 కోట్లు కొట్టేసిన సైబర్‌నేరాల ముఠాను ఇన్‌స్పెక్టర్ సీతారాములు బృందం అరెస్టు చేసింది. దుబాయ్‌లో ఉన్న రితేశ్ సోని బెంగళూర్‌కు చెందిన సమీర్ హందేకర్, దీపక్ సంపత్ సహకారంతో బ్యాంకు ఖాతాలను సేకరిస్తూ బాధితుల నుంచి మోసం చేసిన సొమ్మును ఆయా ఖాతాలో డిపాజిట్ చేయిస్తున్నట్లు వెల్లడయ్యింది. దీంతో ఈ కేసులో బెంగళూర్‌కు చెందిన హందేకర్, దీపక్ సంపత్‌ను అరెస్ట్ చేశారు. అయితే ఈ ఇద్దరు నిందితులు కోదాడ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లోని యువతను వలలో వేసినట్లు విచారణలో వెల్లడయ్యింది. ఈ గ్రామాల్లోని యువతి యువకులు 5 శాతం కమీషన్‌తో సైబర్‌నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చారు. అందులో డిపాజిట్ అయిన సొమ్మును డాలర్లలోకి మార్చి తిరిగి పంపిస్తున్నట్లు బయటపడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఓ యువతి, యువకుడికి నోటీసులు ఇచ్చినట్లు వివరించారు.

డిజిటల్ అరెస్టు చేసి...

'మీ పేరుతో వెళ్తున్న డీహెచ్ఎల్ కొరియర్‌లో డ్రగ్స్ ఇతర నిషేధిత పదార్థాలు ఉన్నాయి.. మేం ముంబై సైబర్ సెల్ నుంచి మాట్లాడుతున్నాం' అంటూ నేరగాళ్లు బాధితుడిని డిజిటల్ అరెస్టు చేసి, రూ. 34 లక్షలు లూటీ చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ బృందంలోని ఎస్సైలు వెంకటాద్రి, షేక్ అజీజ్‌లతో కూడిన బృందం కేసు దర్యాప్తు చేపట్టింది. గుజరాత్, అహ్మదాబాద్‌కు చెందిన బర్లె సంజీవ్ కుమార్ బాబు బాయ్, కాలి రోహిత్‌కుమార్ ఛట్రిష్ కల్మిలు ఇతర దేశాల్లో ఉండే ప్రధాన నేరగాళ్లతో చేతులు కలిపారు. ఈ ముఠాలోని నేరగాళ్లు కొరియర్, టెలికాం, ట్రై, సీబీఐ, సైబర్ పోలీస్, ఇన్‌కం ట్యాక్స్ డిపార్టుమెంట్ అని చెప్పుకుంటారు. ఫేక్ కోర్టు ఆర్డర్ తయారు చేసి బాధితులకు వీడియో కాల్ చేస్తూ, ఎవరికీ చెప్పొద్దని ఇది దేశానికి సంబంధించిన సీక్రెట్ అని భయపెట్టించి డిజిటల్ అరెస్టు చేసి అందిన కాడికి దోచేస్తారు.

వివరాలు వెల్లడిస్తున్న సైబర్ క్రైమ్స్ డీసీపీ కవిత

బల్దియా ఖజానాకు సర్వే గండి!

- అదనపు భారంతో పెరగని ఆస్తిపన్ను వసూళ్లు
- ఈ ఆర్థిక సంవత్సరం రూ. 1970 కోట్ల లక్ష్యం
- ఇప్పటి వరకు రూ.1407 కోట్లు మాత్రమే వసూళ్లు
- రానున్న రెండున్నర నెలల్లో రూ. 563 కోట్ల టార్గెట్
- ఆరు లక్షల మందికి వైట్ నోటీసులు జారీ

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): మూలిగే నక్కపై తాటి పండు పడిందన్న చందంగా 'ఇందిరమ్మ ఇండ్ల సర్వే' బల్దియాకు సరికొత్త తంటాను తెచ్చిపెట్టింది. సంస్థకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను వసూళ్లపై ఈ సర్వే ప్రభావం పడుతున్నది. ప్రభుత్వం గడిచిన కొన్ని నెలలుగా ఆస్తిపన్ను వసూళ్లలో కీలకమైన బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు వరుసగా వస్తున్న సర్వే అదనపు భారం పడుతున్నది. వీరు ఒక పక్క సర్వేలు, మరో పక్క ట్యాక్స్ వసూలు పనులు చేయాల్సి ఉంది. సర్వే కారణంగా ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కావడం లేదని చెబుతున్నారు. గడిచిన రెండు, మూడు నెలలుగా నెలవారీగా ఆస్తిపన్ను రూ. 50కోట్లు దాటడం లేదని అధికారులు చెబుతున్నారు. వసూళ్లు తగ్గడంతో సంస్థ ఖజానాపై తీవ్ర ప్రభావం పడి.. నెలవారీ వేతనాలు సకాలంలో అందలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలోనే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇండ్ల సర్వేతో ఆస్తిపన్ను వసూళ్లు సరిగా లేకపోవడం, రాబోయే రోజుల్లో 26వ తేదీ నుంచి రేషన్ కార్డుల సర్వే, అనంతరం పింఛన్ల సర్వే, గృహలక్ష్మి సర్వే కూడా చేయాల్సి వస్తుందన్నారు.

వైట్ నోటీసులు జారీ..

మొత్తం 19.49 లక్షల ప్రాపర్టీలు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ. 1407 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. 12 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లించారు. మార్చి 31 నాటికి రూ. 563 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అత్యధికంగా శేరిలింగంపల్లి, చందానగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రధానంగా దృష్టి సారించారు. దాదాపు ఆరు లక్షల మందికి వైట్ నోటీసులు జారీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలల 20 రోజుల సమయం ఉంది. ఈ ఏడాది టార్గెట్ రూ.1970 కోట్లలో ఇంకా రూ. 563 కోట్ల కలెక్షన్లు రావాల్సి ఉంది. మార్చి 31 వరకు లక్ష్యాలను చేరుకోవాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. అయితే నిర్ణీత సమయంలో ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం చేరడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జీతాలు పెంచుతామంటూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాల్స్

ఒక్కొక్కరీ నుంచి రూ. వెయ్యి నుంచి 2వేలు వసూలు చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ ఎంపీ అనుచరులు

జీహెచ్ఎంసీలో నయా దందా మొదలైంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే లక్ష్యంగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. గడిచిన కొద్ది రోజులుగా జీహెచ్ఎంసీ జోనల్, సర్కిల్ అన్ని కార్యాలయాల్లోని ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు, డేటా ఆపరేటర్లకు జీతం పెంచుతామని కొందరు కాల్స్ చేస్తున్నారు. 625 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాబితాను దగ్గర పెట్టుకుని జీతం పెంచుతాం, అందుకు నుంచి రూ. వెయ్యి నుంచి రెండు వేల వరకు రేటును ఖరారు చేశామని చెబుతూ.. గూగుల్ పే నంబర్ పంపుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు. జీతం పెరిగిన తర్వాత రెండు నెలల జీతం ఇవ్వాలని అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు ఇప్పటికే డబ్బులు సమర్పించుకోగా, మరికొందరు సందిగ్ధంలో ఉన్నామని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ వసూళ్ల దందాలో నల్గొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనుచరులు ఉన్నారని, ఓ మహిళా నేత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని అడ్మిన్ విభాగంలో కొందరి ప్రమేయంలో ఇటువంటివి చేస్తున్నారని ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.